

నేడు యోగాంధ్ర ర్యాలీలు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొనాలని,శనివారం జిల్లాలోని అన్ని గ్రామాలలో, మండలాలలో, మున్సిపాలిటీలలో, జిల్లా ప్రధాన కేంద్రంలో నిర్వహించే యోగాంధ్ర ర్యాలీ, యోగా నిర్వహించాలన్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ పేర్కొన్నారు. యోగాంధ్ర 2025 క్యాంపెయిన్ ను పెద్ద ఎత్తున ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ మేరకు టెలికాన్ఫరెన్స్‌లో అధికారులకు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 17న శ్రీకాళహస్తి, 18న తిరుపతి, 19న సూళ్లూరుపేట నియోజకవర్గం టిటిడిపరిధిలో భారీ ఎత్తున నిర్వహిస్తామన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో... 8 మంది దుర్మరణం

- కర్నాటక రాష్ట్రంలో ఐదుగురు
- అంతా తిరుపతి, చిత్తూరుజిల్లా వాసులు
- బంగారుపాళ్యంలో ముగ్గురు
- ఆయా గ్రామాల్లో విషాదఛాయలు

భర్త కేశవరెడ్డి మృతివార్త విని వెదురుకుప్పం మండలం ఆళ్మాదుగులలో బిడ్డలతో విలపిస్తున్న సతీమణి

కర్నాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆర్టీసీ బస్సు

కర్నాటక ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు చిన్నారులు

హిత్వీక్‌రెడ్డి (40 రోజులు)

ప్రణతి (5)

గాయపడి చికిత్స పొందుతున్న అక్కాచెల్లెళ్లు

శుక్రవారం తెల్లవారుజామున కర్నాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. కర్నాటకలో జీవనాధారం కోసం కుటుంబాన్ని వెదురుకుప్పం మండలం ఆళ్మాదుగులలో వదిలి వెళ్లిన రైతు కూలి కె.కేశవరెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు. తమ్ముని కొడుకు హిత్వీక్‌రెడ్డి (40 రోజుల బిడ్డ) కేశవరెడ్డి ఒడిలోనే విగతజీవి అయ్యాడు. కేశవరెడ్డి కుటుంబం పెద్దను కోల్పోగా, అతని తమ్ముని కుటుంబం చిన్నబిడ్డను కోల్పోయింది. ఎస్ఆర్ పురం మండలం పుల్లూరు పంచాయతీ కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన తులసి అలియాస్ తనూజ (21) బిటెక్ పూర్తి చేసుకుని బెంగుళూరులో ఉద్యోగ నిమిత్తం వెళుతుండగా మృత్యువు కబళించింది. తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం తిమ్మరాజుపల్లి గ్రామంలో జరిగిన గంగమ్మ జాతరకు ఒంటెల హరిబాబు భార్యబిడ్డలను పంపించాడు. జాతర చూసుకుని బెంగుళూరుకు తిరుగు ప్రయాణమైన ఈ కుటుంబం చిన్నారి 'ప్రణతి'ని కోల్పోయింది. ఈ ప్రమాదంలో పదుల సంఖ్యలోనే క్షతగాత్రులయ్యారు. వీరి కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. అలాగే బంగారుపాళ్యం మండలంలో పాదచారులను కారు ఢీకొన్న ఘటనలో మరో ముగ్గురు మృతిచెందారు. ఏదిఏమైనా శుక్రవారం కర్నాటక రాష్ట్రంలోనూ, బంగారుపాళ్యంలోనూ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు.

ప్రజాశక్తి - వెదురుకుప్పం

కర్నాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో చిత్తూరు జిల్లా జీడీనెల్లూరు నియోజకవర్గానికి చెందిన నలుగురు, రామచంద్రాపురం మండలం తిమ్మరాజుపల్లి గ్రామంలో ఒంటెల హరిబాబు చిన్నకుమార్తె ప్రణతి (5) మృతిచెందారు. మృతులు వెదురుకుప్పం మండలం ఆళ్మాదుగుల చెందిన రైతు కూలీ కె.కేశవరెడ్డి అలియాస్ పెద్దబ్బరెడ్డి (45), సోదరుని కొడుకు హిత్వీక్‌రెడ్డి (40 రోజులు), శ్రీరంగరాజపురం మండలం పుల్లూరు పంచాయతీ కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన తులసి అలియాస్ తనూజ (21) సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జీడీనెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లి పంచాయతీ శారద (45) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ ప్రమాదంలో వెదురుకుప్పం మండలం నచ్చుకూరు గ్రామానికి చెందిన విజాపాత ధనలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. భర్త మదన్‌మోహన్‌రెడ్డి, కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పెనుమూరు మండలానికి చెందిన చాతుర్య తిరుపతి చదలవాడ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతోంది. ఎడమకాలుకు తీవ్ర గాయాలైనట్లు అధికారులు తెలిపారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి శుక్రవారం బంధువులకు అప్పగించారు.

పొట్టకూటి కోసం వలస వెళుతూ...

కన్నబిడ్డలను వదిలి తమ్ముని కుటుంబంతో పొరుగు రాష్ట్రానికి పయనమై దారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అభాగ్యులు అశువులు బాశారు. జీడీనెల్లూరు నియోజకవర్గ పరిధిలో వెదురుకుప్పం, శ్రీరంగరాజపురం, గంగాధరనెల్లూరు, పెనుమూరు మండలాల నుంచి పలు కుటుంబాలు జీవనాధార నిమిత్తం కర్నాటక రాష్ట్రం బెంగళూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. నియోజకవర్గ పరిధిలోని వెదురుకుప్పం మండలం ఆళ్మాదుగుల చెందిన రైతు కూలి కె.కేశవరెడ్డి అలియాస్ పెద్దబ్బరెడ్డి (45) తన కుటుంబంతో కలిసి బెంగుళూరులో ప్లంబరింగ్‌పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారం రోజుల క్రితం వ్యవసాయ పనుల నిమిత్తం సోదరుడు జనార్దన్‌రెడ్డి కుటుంబంతో కలిసి గ్రామానికి చేరుకుని పనులు ముగించుకుని భార్య శ్యామల, ముగ్గురు పిల్లలను ఇంటి వద్ద వదిలి, తల్లి పాపమ్మ, సోదరుడు జనార్దన్‌రెడ్డి, మరదలు గిరిజ, పిల్లలు హిత్వీక్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డితో కలిసి బెంగుళూరుకు గురువారం రాత్రి బయల్దేరారు. కర్నాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద జరిగిన ప్రమాదంలో కె.కేశవరెడ్డి అలియాస్ పెద్దబ్బరెడ్డి (45), తమ్ముని కుమారుడు హిత్వీక్‌రెడ్డి (45రోజులు) మృతిచెందారు.

ప్రమాదం జరిగింది తీరు ఇలా...

చిత్తూరు రెండో డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో రాత్రి 9.30 గంటల సమయంలో ప్రయాణికులతో డ్రైవర్ కరుణాకర్‌రెడ్డి బయల్దేరాడు. చిత్తూరు నుంచి తాము నివాసం ఉంటున్న బెంగళూరు నగరంలోని పుట్టణహళ్లి ప్రాంతానికి వెళ్లే బస్సు కావడంతో కె.కేశవరెడ్డి తమ్ముని కుటుంబంతో కలిసి బస్సులో బయల్దేరాడు. రాత్రి రెండు గంటల సమయంలో కర్నాటక రాష్ట్రం హోస్పేట సమీపంలో కేశవరెడ్డి ప్రయాణిస్తున్న బస్సును ముందు వెళుతున్న లారీని అధిగమించబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. కేశవరెడ్డి, అతని ఒడిలో నిద్రపోతున్న తమ్ముని కొడుకు హిత్వీక్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు. సోదరుడు జనార్ధన్‌రెడ్డి, మరదలు గిరిజ, తమ్ముని పెద్ద కుమారుడు జశ్వీన్‌రెడ్డి, తల్లి పాపమ్మ గాయాలతో బయటపడ్డారు. ఇదే బస్సులో శ్రీరంగరాజపురం మండలం పుల్లూరు పంచాయతి కమ్మకండ్రిగకు చెందిన తులసి అలియాస్ తనూజ (21) సంఘటనా స్థలంలోనే మృతిచెందింది. తులసి పుల్లూరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు రమేష్ కుమార్తె బిటెక్ చదువుతోంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంగాధర్‌నెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లి పంచాయతీకి చెందిన శారద (45) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలోనే వెదురుకుప్పం మండలం నచ్చుకూరు గ్రామానికి చెందిన ధనలక్ష్మి, భర్త మదన్‌మోహన్‌రెడ్డి, కుమారుడు గాయాలతో బయటపడ్డారు. పెనుమూరు మండలానికి చెందిన చాతుర్య తిరుపతి చదలవాడ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతోంది. ఆమెకు ఎడమకాలికి తీవ్ర గాయమయ్యింది. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

పాదచారులను ఢీకొన్న కారు

ప్రజాశక్తి - బంగారుపాళ్యం పాదచారులను కారు ఢీకొన్న ఘటనలో చిత్తూరు జిల్లా బంగారుపాళెం మండలంలో తిమ్మాజిపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుందని సిఐ శ్రీనివాసులు తెలిపారు. తంగరాజు కుమారుడు సాదరయ్య (45), కృష్ణంనాయుడు కుమారుడు రాజేంద్రనాయుడు (54) ఇరువురూ సర్వీసు రోడ్లో నడుచుకుంటూ వెళుతున్నారు. పలమనేరు నుంచి వస్తున్న కారు వీరిని అతి వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో రాజేంద్రనాయుడు, కారులో ఉన్న సయ్యద్ దిలీప్ ఇరువరూ సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. సాదరయ్యను బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి వేలూరు సిఎంసికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. కారులో ప్రయాణిస్తున్న మొబినా, ఆసం ఫాతిమా, సయ్యద్ అలీ, బేబీ ఫాతిమాకు గాయాలయ్యాయి. వీరికి ప్రథమ చికిత్స చేపట్టి మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. సయ్యద్‌దిలీప్ పాదచారులను ఢీకొని భయంతో పక్కనే ఉన్న చెట్టును ఢీకొనడంతో మృతిచెందాడు.

చిన్నారి ప్రణతి మృతి
ఇద్దరు అక్కలకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - రామచంద్రాపురం (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం, తిమ్మరాజు పల్లిలో గంగమ్మకు కుంభాలు ఉత్సవాలకు వచ్చి తిరిగి బెంగళూరుకు వెళు తుండగా హోస్‌పేట వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తిమ్మరాజు పల్లి గ్రామానికి చెందిన ఒంటెల హరిబాబు చిన్న కుమార్తె ప్రణతి(5) మతి చెందింది. హరిబాబు పెద్ద కుమార్తె కాత్యాయాణి ఎడమ కాలు విరిగిపోయింది, రెండవ కుమార్తె మాధురికి కుడి చెయ్యికి తీవ్ర గాయం అయింది. ఒంటెల హరిబాబు బెంగళూరులో ఆర్మీలో ట్రైనింగ్ ఆఫీసర్ గా పనిచేస్తున్నాడు. అతని భార్య రోహిణి, ముగ్గురు కూతుళ్లు తిమ్మరాజు పల్లిలో నివాసం ఉంటూ..... రామచంద్రపురం గీతాంజలి స్కూల్‌లో చదువుకుంటూ ఉండేవారు. ఇటీవల ఒంటెల హరిబాబు వేర్వేరుగా నివాసాలు ఉండడం ఎందుకని వేసవి సెలవుల్లో తన కుటుంబ సభ్యులను బెంగుళూరుకు కాపురం మార్చాడు. మంగళవారం తిమ్మరాజు పల్లి గ్రామ దేవత అయిన నడి వీధి గంగమ్మకు కుంభాలు ఉత్సవాల కార్యక్రమానికి బెంగళూరు నుండి ఒంటెల హరిబాబు భార్య రోహిణి, కూతుళ్లు ముగ్గురు తిమ్మరాజు పల్లికి వచ్చారు. గంగమ్మకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించుకుని ఉత్సవాలలో పాల్గొన్నారు. గురువారం రాత్రి తిరిగి ఆర్టీసీ బస్సులో బెంగళూరుకు వెళుతున్న సందర్భంలో హోస్‌పేట వద్ద టిప్పర్ బస్సును ఢీకొన్న ప్రమాదంలో ఒంటెల హరిబాబు చిన్న కుమార్తె ప్రణతి మతి చెందింది, ఇద్దరు కుమార్తెలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇద్దరు కుమార్తెలను ప్రైవేట్ హాస్పిటల్ లో వైద్య పరీక్షలు చేయించారు. ప్రణతి మతదేహాన్ని స్వగ్రామమైన తిమ్మరాజు పల్లికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో చిన్నారి ప్రణతి మరణ వార్తను శుక్రవారం ఉదయం తెలియడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. 'గంగమ్మ నా బిడ్డను కాపాడ రాదా'. అంటూ తల్లి రోహిణి, తండ్రి ఒంటెల హరిబాబు కన్నీరు మున్నరై వినిపిస్తున్నారు. శనివారం తిమ్మరాజుపల్లి లో ప్రణతి అంత్యక్రియలు నిర్వహించినట్లు బంధువులు తెలిపారు.

నిర్బంధంగా పాఠశాల విలీనం వద్దు
బడికి బీగం వేసి ఎ.పార్లపల్లి గ్రామస్తుల ధర్నా

విద్యార్థులతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ

'మా బడి మా ఊళ్లోనే ఉండాలని, మా బడి పిల్లలు మా ఊళ్లోనే చదువుకోవాలి.. మా పిల్లల భద్రత మాకు ముఖ్యం.. విలీనం వద్దని చెప్పి తీర్మానం చేసినా పట్టించుకోరే' అంటూ ఎ.పార్లపల్లి గ్రామస్తులు బడికి బీగం వేసి శుక్రవారం ధర్నా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 117 రద్దుచేసి, పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ధర్నా చేశారు. మా పాఠశాలలో 3,4, 5 తరగతుల పిల్లలను పివి కండ్రిగ పాఠశాలలో విలీనం చేయాలని ఎస్ఎంసి తీర్మానం చేయాలని కోరారని, అయితే మా పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్ గానీ, మిగిలిన సభ్యులు గానీ తీర్మానాన్ని అంగీకరించలేదని గుర్తు చేశారు. పివి కండ్రిగ పాఠశాలలో విలీనం చేయొద్దని ఏకగ్రీవంగా తిరస్కరణ తీర్మానాన్ని పంపించారు. రోడ్డుకు ఇరువైపులా చెరువు, పంట కాల్వలు, చెరువు గట్టుపైనే రోడ్డు ఉండటం, రోడ్డు మధ్యలో కలుజు పారడం, రోడ్డు పక్కనే శ్మశానం ఉండటం వల్ల తమ పిల్లలకు భద్రత ఉండదన్నారు. తమ పిల్లలు పివికండ్రిగ పాఠశాలకు వెళ్లలేరని అనేకమార్లు మండల విద్యాశాఖ అధికారి ఆఫీసుచుట్టూ తిరిగినా, నిర్బంధంగా పాఠశాలను విలీనం చేశారన్నారు. తమ పాఠశాలలో చదివే పిల్లలను ఎటువంటి పరిస్థితుల్లోనూ మూడు కిలోమీటర్ల రోడ్డు మార్గాన బయట పాఠశాలకు పంపించలేమని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను అధికారుల దృష్టిలో పెట్టుకుని, తమ గ్రామంలో పాఠశాలను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు గంగయ్య, అయ్యప్ప, చలపతి పాల్గొన్నారు.

గ్రామ దేవత ఉత్సవాల్లో అపశృతి
బాణసంచా పేలి విద్యార్థి మృతి

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

లోకేష్ (17)

గ్రామ దేవత ఉత్సవాల్లో అపశృతి చోటుచేసుకుంది. బాణసంచా పేలుళ్లలో యువకుడు మృతి చెందడంతో ఉత్సవంలో విషాద ఛాయలు అలముకున్నాయి. గ్రామస్తుల వివరాల మేరకు... కారిపాకం గ్రామంలో బుధవారం రాత్రి గ్రామ దేవత ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు ఇందులో భాగంగా భారీగా బాణాసంచా పేల్చే క్రమంలో కొంత దూరంలో బాంబులు నిల్వ ఉంచిన ప్రదేశంలో నిప్పు రవ్వలు పడి ప్రమాదవశాత్తు పెద్ద సంఖ్యలో బాంబులు పేలిపోవడంతో అది చూడ్డానికి వచ్చిన లోకేష్ (17) అనే ఇంటర్ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన చెన్నైలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. 90 శాతం పైగా కాలిపోవడంతో శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. ఇదిలా ఉండగా చేనేత కుటుంబానికి చెందిన ఉషా కృష్ణయ్య దంపతులకు ఒక్క కొడుకు. చేతికి అంది వచ్చిన కొడుకు కళ్ళముందే చని పోవడంతో కుటుంబం శోక సముద్రంలో మునిగిపోయింది. స్థానికంగా సాయి అనే యువకుడు ఎటువంటి అనుమతులు లేకుండా ఈ బాణసంచా తయారీ పరిశ్రమను నిర్వహిస్తున్నట్లు సమాచారం. స్థానికంగా జరుగుతున్న ఉత్సవాల్లో నిబంధనలకు మించి నల్లమందు వినియోగం జరగడంతో అధిక శబ్దంతో కూడిన బాంబులను తయారు చేయడమే ఈ ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. చుట్టుపక్కల గ్రామ దేవత ఉత్సవాలు ఎక్కువగా జరుగుతున్న సమయంలో ఇటువంటి బాణాసంచా తయారీ పరిశ్రమలపై స్థానిక పోలీసులు, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఉంటే ఇటువంటి ప్రమాదాలను అరికట్టడానికి అవకాశం ఉంటుందని ప్రజలు కోరుతున్నారు అక్రమంగా నిర్వహిస్తున్న బాణసంచా తయారీ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఎస్ఐ మల్లికార్జున్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీ ట్రస్టులకు రూ.20.50 లక్షల విరాళం

ప్రజాశక్తి -తిరుమల

టీటీడీకి శుక్రవారం రూ.20.50 లక్షలు విరాళంగా అందింది. విజయవాడలోని ఫార్చ్యూన్ ఫైన్ జ్యూవెలర్స్ కు చెందిన కోమటి సునీల్ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10,50,001 విరాళం అందించారు. తాడేపల్లిగూడేనికి చెందిన మాతూరు పంచాక్షరి బాలాజీ ఆరోగ్య వర ప్రసాదిని పథకానికి రూ.10,00,116 విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు దాతలు తిరుమలలోని టీటీడి అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు.

చిన్న ఆస్పత్రులను అడ్డుకోవడం సరైనది కాదు : అప్నా

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ప్రజలకు అత్యంత చేరువలో ఉండే చిన్న హాస్పిటల్స్‌ను అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని, అత్యవసర సమయంలో మొదట చిన్న హాస్పెటల్సే ఉపయోగపడతాయన్న విషయాన్ని ప్రజలు ఆలోచించి చిన్న హాస్పిటల్స్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హెూమ్స్ అసోసియేషన్(అప్నా) రాష్ట్ర అధ్యక్షులు,ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ హాస్పిటల్ అండ్ నర్సింగ్ హెూమ్స్ ఆఫ్ ఇండియా ఆల్ ఇండియా జనరల్ సెక్రెటరీ డాక్టర్ ఏ.వి సుబ్బారెడ్డి కోరారు. జూన్ 9వ తేదీ సోమవారం తిరుపతిలోని ఓ 20 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని ఆపాలని వచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం అప్నా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సుబ్బారెడ్డి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ డాక్టర్ జనార్దన్, తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ రవిరాజు, కార్యదర్శి డాక్టర్ మారుతి కష్ణ, కోశాధికారి డాక్టర్ దామోదర్ తో కలిసి నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. పరిసర ప్రాంతాలలో చిన్న ఆసుపత్రులు ఉండడం వలన అత్యవసర సమయంలో అవసరమైన వైద్యం అందించడమే కాక పెద్ద ఆసుపత్రికి వెళ్లే లోపు రోగికి కావలసిన కనీస వైద్యాన్ని పొందగలమన్న విషయాన్ని గ్రహించాలన్నారు.

అనుమతులు ఉన్నాయి : కమిషనర్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదు మేరకు హాస్పిటల్ స్థాపనకు కావలసిన నియమ నిబంధనలన్నీ ఎంక్వయిరీ చేయడం జరిగిందన్నారు .ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు ఉండడంతో హాస్పిటల్ నిర్మాణం కొనసాగించేందుకు పర్మిషన్ ఇచ్చామని కమిషనర్ మౌర్య తెలిపారు.



చిన్నపిల్లలకు సురక్షితమైన అత్యాధునిక వైద్యమే లక్ష్యం
అపోలో పిఐసియు హెచ్ఓడి డాక్టర్ రాజేశ్వరి నాయక్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

అపోలో ఆసుపత్రి చిన్నపిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ముందున్నదని, చిన్నపిల్లల శస్త్ర చికిత్సలో 100 శాతం విజయం సాధించడమే అందుకు నిదర్శనమని చెన్నై అపోలో హాస్పిటల్ పీడియాట్రిక్ ఇంటెన్సీ కేర్ యూనిట్(పిఐసియు) విభాగాధిపతి డాక్టర్ రాజేశ్వరి నాయక్ తెలిపారు.తిరుపతిలోని ఇద్దరు చిన్నారులకు విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించిన సందర్భంగా స్థానిక లక్ష్మీపురం సర్కిల్ లోని అపోలో హాస్పిటల్ లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ రాజేశ్వరి నాయక్ మాట్లాడుతూ చెన్నైలోని అపోలో చిన్న పిల్లల హాస్పిటల్ అత్యవసర చికిత్స విభాగం (పిఐసియూ)అత్యాధునిక చికిత్స సదుపాయాలు కలిగి ఉందన్నారు. చెన్నై అపోలో హాస్పిటల్ అత్యంత అనుభవం కలిగిన పిఐసియు వైద్య బందం,ప్రొఫెషనల్ నర్సులతో 24/7 కలిగి ఉండడమే కాక, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాలతో ఐసీయూ కూడా అందుబాటులో ఉందన్నారు. తమ ఆసుపత్రిలో డెంగ్యూ, మెదడు జ్వరం, నిమోనియా వంటి తీవ్రమైన ఇన్ఫెక్షన్ నయం చేయడమే కాక రోడ్డు ప్రమాదాలు వంటి పాలీ ట్రామా కేసులను, అవయవాల క్రియల్లో లోపాలు, మల్టీ ఆర్గాన్ ఇన్వాల్వెమెంట్ వంటి ఎంతో క్లిష్టమైన చికిత్సను కూడా నూతన టెక్నాలజీ కలిగిన ఆపరేషన్ థియేటర్ల ద్వారా 100 శాతం సక్సెస్ రేట్ కలిగి ఉన్నామన్నారు. తిరుపతికి చెందిన 13 ఏళ్ల వషిష్ట్ సాయి,మూడేళ్ల నిత్యశ్రీ కి ఎంతో క్లిష్టమైన ఆపరేషన్లు సైతం విజయవంతంగా నిర్వహించగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నై అపోలో చిన్నపిల్లల హాస్పిటల్ యూనిటీ హెడ్ రంజని, వైద్య బందం డాక్టర్ సుచిత్ర రంజిత్, డాక్టర్ చిదంబరం, డాక్టర్ ప్రియవర్ధిని, డాక్టర్ వసంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాను అడ్డుకున్న 'రెవెన్యూ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొత్తపల్లి స్మశాన వాటిక డివిఆర్ ఆసుపత్రి రోడ్డు వెంకటరెడ్డి కాలనీ మధ్యలో ఉన్నసర్వే నంబర్155/1 లో ప్రభుత్వ భూమి కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారు. సుమారు మూడు కోట్ల రూపాయలు విలువచేసే ఈ భూమిని పరిరక్షించాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో తాసిల్దారు భాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు శుక్రవారం కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఆరు ఇళ్ళను నిర్మాణం చేపడుతూ ఉండడంతో జెసి బి ద్వారా వాటిని కూల్చి వేశారు. తిరుపతి నగరానికి నడిబొడ్డున ఈ భూమి ఉండడంతో కోట్లాది రూపాయలు విలువ చేసే ఈ భూమిని కాపాడామని తహశీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు.ఈ విషయమై 'ప్రజాశక్తి' తహశీల్దార్‌ను వివరణ కోరగా ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జా చేసి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తమకు ఫిర్యాదు అందిందని, వెంటనే అక్రమ నిర్మాణాలను కూల్చివేశామన్నారు. ఇటీవల మంగళం, చెన్నాయగుంట, తిమ్మినాయుడుపాలెం ప్రాంతాల్లోనూ భూములు కబ్జాకు గురైతే వాటిని అడ్డుకున్నట్లు తెలిపారు. తహశీల్దార్ భాగ్యలక్ష్మి బదిలీ అవుతారని పుకార్లు షికార్లు చేస్తుండడంతో యథేచ్ఛగా కబ్జాకు అక్రమార్కులు తెరలేపినట్లు తెలుస్తోంది.

మామిడి రైతులకు అన్యాయం చేయొద్దు : సిపిఎం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ

గుజ్జుపరిశ్రమ యజమానులు మామిడి రైతులకు ప్రభుత్వం ప్రకటించినట్లుగా కేజీకి రూ.7 ఇవ్వాలని శ్రీకాళహస్తి ప్రాంతీయ సిపిఎం నాయకులు గంధం మణి డిమాండ్‌చేశారు. శుక్రవారం ఉదయం బిఎన్ కండ్రిగ మండలం గాజులపెళ్లూరు పంచాయతీలోని గుజ్జు పరిశ్రమ యాజమాన్యాన్ని కలిసి మామిడి రైతులకు అన్యాయం చేయొద్దని, ప్రభుత్వం ప్రకటించినట్లుగా గిట్టుబాటు ధర ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందిస్తూ కేజీ మామిడికి రూ.7 ఇస్తున్నామని, ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహం ఐదు రూపాయలు కలిపి రూ.12 రూపాయలు రైతుల అకౌంట్లో పడుతుందన్నారు. ఖచ్చితంగా రైతు ఏ సచివాలయ పరిధిలో పంట తీసుకుని వస్తారో వివరాలు సంబంధిత సచివాలయ కార్యదర్శి దగ్గర లెటర్ తీసుకుని, ఆధార్, బ్యాంకు అకౌంట్ వివరాలను పరిశ్రమ వద్ద ఇస్తేనే ప్రభుత్వ ప్రోత్సాహం కలిపి రూ.12 రైతుల అకౌంట్లో పడుతుందని తెలిపారు. వివరాలు లేకపోతే రూ.7 రూపాయలు మాత్రమే జమ అవుతుందని వివరించారు. మండల కార్యదర్శి రమణయ్య, బాల గురవయ్య, గురవయ్య పాల్గొన్నారు.

శ్రీసిటీ-నాఫ్ ఇండియా పరిశ్రమకు 'గ్రీన్' గుర్తింపు

ప్రజాశక్తి -వరదయ్యపాలెం

శ్రీసిటీలోని నాఫ్ ఇండియా పరిశ్రమకు ప్రతిష్టాత్మక 'గ్రీన్' (పర్యావరణ హిత సంస్థ) గుర్తింపు దక్కింది. ఈ నెల 12న హైదరాబాద్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ నిర్వహించిన 'గ్రీన్‌కో సమ్మిట్ 2025' కార్యక్రమంలో ఈ అవార్డును నాఫ్ ఇండియాకు అందజేశారు. ఈనెల 12, 13 వ తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ అంతర్జాతీయ సదస్సులో నికర-సున్నా పరివర్తన, వత్తాకార ఆర్థిక వ్యవస్థ, సుస్థిర అభివద్ధి తదితర రంగాలకు సంబంధించిన అంతర్జాతీయ నిపుణులు, పరిశ్రమ ప్రముఖులు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు పాల్గొన్నారు. నాఫ్ బృందాన్ని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు.

వామపక్షాల ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల

వేణుగోపాల్ కాలనీ నిర్వాసితులకు న్యాయం చేయాలి
పోలీసులు నిర్లక్ష్యం వీడి రౌడీలను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతికి కూతవేటు దూరంలో ఉన్న తిరుమలనగర్ పంచాయతీ పరిధిలోని వేణుగోపాల్ కాలనీలో గతనెల 26వ తేదీ అర్ధరాత్రి 300 మంది రౌడీలు, ఏడు జేసీబీలు, ఒక ట్రాక్టర్‌తో కరెంట్ కట్ చేసి ఇళ్లను కూల్చివేసి దౌర్జన్యానికి పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేసినా ఇంతవరకూ రౌడీలను పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని వామపక్షాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం యశోదానగర్‌లోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి రవి, సిపిఎం నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో 'నిర్వాసితులకు న్యాయం చేయాలి' అంటూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఘటన జరిగి 20 రోజులు అవుతున్నా రౌడీలను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. ఆర్‌డిఒ సైతం కోర్టులో కేసు నడుస్తోందని, అయినా ఈ రకంగా దాడిచేసి కొట్టే సంస్కృతి మంచిది కాదని చెప్పారని, అయినా పోలీసులు రౌడీలను అరెస్టు చేయడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. శాంతిభద్రతలను కాపాడటం అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. సిపిఎం నాయకులు టి.సుబ్రమణ్యం, ఎన్.మాధవ్, పి.బుజ్జి, పి.చిన్న, ఎం.నరేంద్ర, సిపిఐ నాయకులు వెంకటేష్, శ్రీను, ఇళ్ల పోరాట కమిటీ నాయకులు వెంకటేష్, రిషి, శ్రీరాములు పాల్గొన్నారు. ఈ ఘటనకు ప్రేరేపించిన రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి సి.రాజన్‌బాబు, ఆయన భార్య నిర్మల, అడ్వకేట్ రమణారెడ్డి, చంద్రగిరి మస్తాన్, మునిరెడ్డిలను అరెస్టు చేసి జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు.

లడ్డూ ప్రసాదంపై ఆరోపణలు సత్య దూరం

ప్రజాశక్తి - తిరుమల లడ్డూ ప్రసాదంపై సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్న తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన నవీన్ కుమార్ అనే వ్యక్తి ఆరోపణలను టీటీడీ తీవ్రంగా ఖండించింది. జూన్ 8న, స్వామివారి లడ్డూ ప్రసాదం తినేటప్పుడు నోటిలో గాయమైందని సదరు వ్యక్తి ఆరోపణలు చేశారు. వెంటనే స్పందించిన టీటీడీ, సదరు వ్యక్తిని అంబులెన్సు ద్వారా తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేశారు. అనంతరం స్విమ్స్ ఆసుపత్రిలో కూడా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య పరీక్షలలో సదరు వ్యక్తి ప్రసాదం తినేటప్పుడు తన నాలుకను తానే కొరుక్కోవడంతో నాలుక కింద భాగంలో కేవలం చిన్నపాటి గాయం అయినట్లు రిపోర్ట్స్ వచ్చాయి. అయినప్పటికీ టిటిడి వద్ద నష్టపరిహారం పొందాలనే దురుద్దేశంతో సదరు వ్యక్తి లడ్డూ ప్రసాదంపై సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేస్తున్నట్లు టిటిడి గుర్తించి సదరు వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

విద్యను వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ సంస్థలు సీజ్ చేయాలి

ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి ఏఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యతో వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఏఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం ఎంఈఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ భూపతిరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మహేష్, పుత్తూరు మండల కార్యదర్శి దిలీప్ కుమార్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నారాయణ, శ్రీచైతన్య విద్యా సంస్థల లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారని ఆరోపించారు. అధికారులు ఈ సంస్థలవైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శించారు. పుస్తకాలు, యూనిఫారం, ఐడి కార్డుల పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలు, వసతులు నామమాత్రంగా ఇస్తున్నారని దుయ్యబట్టారు. విద్యార్థులు క్రీడల వైపు వెళ్లకుండా యంత్రాల్లా వారిని బట్టీ విధానంలో చదివిస్తున్నారని మండిపడ్డారు. అధికారులు ఈ విద్యా సంస్థలను పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలోనే నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్, గోపి, వెంకటేష్, ఆనంద పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారిణులు బాధ్యతల స్వీకరణ

మమత

ప్రజాశక్తి - రామచంద్రపురం : రామచంద్రాపురం మండలం వ్యవసాయ అధికారిణిగా మమత శుక్రవారం గంగిరెడ్డిపల్లి ఎన్టీఆర్ రైతు సేవా కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న స్రవంతి అన్నమయ్య జిల్లా, మూలకలచెరువు మండలానికి బదిలీపై వెళ్లారు. తిరుపతి రూరల్ మండలంలో పనిచేస్తున్న మమత రామచంద్రాపురం మండలాని బదిలీపై వచ్చారు. ఆమె మాట్లాడుతూ త్వరలో మండల పరిధిలోని రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు అందిస్తామన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు.

సాగరిక

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండల వ్యవసాయ అధికారిణిగా సాగరిక శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఏర్పేడులో వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న కదిరి షణ్ముఖం ఇటీవల సాధారణ బదిలీలలో భాగంగా బుచ్చినాయుడు కండ్రిగకి వెళ్లారు. అన్నమయ్య జిల్లా, సంబేపల్లి మండలంలో విధులు నిర్వహిస్తున్న బి.సాగరిక ఏర్పేడు మండల వ్యవసాయ అధికారణిగా బదిలీపై వచ్చారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి -ఏర్పేడు : మడిబాక పంచాయతీ, రాజుల కండ్రిగలో గ్రామస్తులు తాగు నీటి సమస్యను మండల అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు దృష్టికి తీసుకు రాగా, ఆయన ఎంపీడీవో సౌభాగ్యమ్మకి తెలియపరిచారు. స్పందించిన ఎంపీడీవో శుక్రవారం బోర్ డ్రిల్లింగ్ పనులను గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏఈ సుబ్రమణ్యం పర్యవేక్షణలో ప్రారంభించారు. నీరు సమృద్ధిగా పడడంతో గ్రామస్తులు తాగు నీటి సమస్య పరిష్కారమైందని సంతోషం వ్యక్తం చేశారు.

నేడు యోగాంధ్ర

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ మంజునాథ గౌడ్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ పుత్తూరు పురపాలక సంఘం, మార్కెట్ యార్డ్ ప్రక్కన గల వై.యస్.ఆర్ తుడా మునిసిపల్ పార్క్, వార్డు సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన వేదికల వద్ద యోగ కార్యక్రమం ఉ.6 నుండి 9 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు, పురపాలక సంఘ కార్యాలయ సిబ్బంది, వార్డు సచివాలయ, మెప్మా సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేద్దాం

ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు స్వీకరించిన సునీతను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది

ప్రజాశక్తి - రామచంద్రపురం : ప్రభుత్వ పాఠశాలోని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని, బోధనలో మెలకువలు ప్రదర్శిస్తూ, నైతిక విలువలతో కూడిన విద్యను వారికి అందించాలని చేకూరి నాగమ నాయుడు ఎర్రమ్మల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన ప్రధానోపాధ్యాయురాలు సునీత కోరారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ ప్రధానోపాధ్యాయురాలుగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆమెను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎల్.టి.ఏ జిల్లా అధ్యక్షులు దొడ్డ ఉమామహేశ్వర్, ఐ.వెంకటరామయ్య, కృష్ణార్జున రెడ్డి, దిలీప్ కుమార్, బ్రహ్మం, శ్రీరాములు, కోటేశ్వర బాబు, ముని రాజ, విశ్వనాథం, సుబ్రహ్మణ్యం, జ్యోతి, శాంతి, భార్గవి, లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - కేవిబి పురం: సత్యవేడు నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా పని చేస్తానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అంజూరు పంచాయితీ, జయలక్ష్మీపురం వద్ద కాళంగి నదిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం అంజూరులో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన పశువుల నీటి తొట్టెను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అంజూరులో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన కాంక్రీట్ రోడ్డు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళంగి నదిపై వంతెన లేకపోవడం వల్ల వర్షా కాలంలో నదిలో నీరు ప్రవహించి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, ఉన్నతాధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి బ్రిడ్జి నిర్మించాలని పట్టుబట్టానన్నారు. వారు సానుకూలంగా స్పందించి రూ.6.50 కోట్లు నిధులు మంజూరు చేయడంతో పాటు టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారిమెట్టు చిరు వ్యాపారస్తులకు న్యాయం చేయాలి

- 15న వ్యాపారస్తుల కుటుంబ సభ్యులతో సామూహిక నిరాహార దీక్ష
- టీటీడీ మొండి వైఖరి వీడనాడాలి : జయచంద్ర

విలేకరుల సమావేశంలో ప్లే కార్డులు ప్రదర్శిస్తున్న శ్రీవారి మెట్టు చిరు వ్యాపారస్తులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత 25 ఏళ్లగా శ్రీవారి మెట్టు మార్గంలో చిరు వ్యాపారాలు చేసుకుంటూ పొట్ట పోసుకుంటున్న చిరు వ్యాపారస్తులు 298 రోజులుగా తమకు న్యాయం చేయాలని కోరుతున్నా, టీటీడీ మొండి వైఖరి ప్రదర్శించడం మంచి పద్ధతి కాదని ఇందుకు నిరసనగా ఈ నెల 15వ తేదీన శ్రీవారి మెట్టు మార్గంలో వ్యాపారం చేసుకునే 30 మంది, వారి కుటుంబ సభ్యులతో కలసి పెద్ద ఎత్తున సామూహిక నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టనున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి జయచంద్ర తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో శ్రీవారిమెట్టు చిరు వ్యాపారస్తులతో కలిసి ఆయన మాట్లాడారు. 15న చేపట్టనున్న సామూహిక నిరాహార దీక్షకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందరపు మురళి, సిఐటియు అనుబంధ సంఘాలు పెద్ద సంఖ్యలో హాజరవుతాయన్నారు. అలిపిరి మెట్ల మార్గంలో చిరుత పులి దాడి జరిగితే శ్రీవారి మెట్లు వద్ద వ్యాపారం చేసుకునే వారిని ఖాళీ చేయించి, వారి కుటుంబాలను నేడు రోడ్డున పడేసారన్నారు. శ్రీవారి మెట్ల మార్గంలో వ్యాపారాలు చేసుకుంటూనే ఎంతో నిజాయితీగా తిరుమలకు మద్యం, మాంసం సరఫరా చేసే వారిని, శేషాచలం నుండి అరుదైన ఎర్రచందనం తరలించే స్మగ్లర్లను సైతం అడ్డుకొని బలగాలకు పట్టించిన ఘనత చిరు వ్యాపారస్తులదన్నారు. టిటిడి చైర్మన్, ఈవోలకు వ్యాపారులకు శాశ్వత పరిష్కారం చూపాలని విన్నవించామన్నారు. టిటిడి అధికారులు వ్యాపారస్తుల సమస్యను పట్టించుకోవడం లేదని విమర్శించారు. టిటిడి వైఖరి ఇలానే కొనసాగితే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టి, ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. శ్రీవారి మెట్ల చిరు వ్యాపారస్తుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు చిట్టిబాబు, లోకనాథంలు మాట్లాడుతూ మెట్ల మార్గంలో వ్యాపారం చేసుకుంటూ, తమ పిల్లలను చదివించుకుంటూ కుటుంబ పోషణ చూసుకునే వాళ్ళమని, నేడు పిల్లల చదువులు, కుటుంబ పోషణ భారమైన నేపథ్యంలో న్యాయం చేయాలని కోరుతూ 298 రోజులుగా టీటీడీ పరిపాలన భవనం ముందు న్యాయం కోసం ఎదురుచూస్తున్నామన్నారు. మానవతా దృక్పథంతో టిటిడి ఉన్నతాధికారులు స్పందించి తమ కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో శ్రీవారి మెట్లు చిరు వ్యాపారస్తుల సంఘం ఉపాధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి యుగంధర్, ఉప కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

ఆరోగ్య కేంద్ర భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, డిఎం అండ్ హెచ్ఓ బాలకృష్ణ నాయక్

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, డిఎం అండ్ హెచ్ఓ బాలకృష్ణ నాయక్‌ను కోరారు. శుక్రవారం ఉదయం పిచ్చాటూరు, నాగలాపురం గ్రామాలలో డిఎం అండ్ హెచ్ఓతో కలిసి పర్యటించి నూతనంగా నిర్మించిన ప్రజా ఆరోగ్య కేంద్ర భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి నిధులు కేటాయిస్తుందని, సరిపడ వైద్యులు, సిబ్బందిని నియమించిందన్నారు. వీటిని వినియోగించి గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే బాధ్యతను వైద్యశాఖ తీసుకోవాలని కోరారు. ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం అందించినప్పుడే రాష్ట్రం సమగ్ర అభివృద్ధి చెందినట్లని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం విమాన ప్రమాద మృతుల పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించారు. తదుపరి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, పాఠ్యపుస్తకాలు, సమరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఓ శివయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ మునిచరిత్ర, డాక్టర్ ధనుష్, ఏఎంసీ చైర్మన్ ఇలంగోవన్ రెడ్డి, ఎంపీడీఓ మహమ్మద్ రఫీ, తహసిల్దారు టీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ లు హేమమాలిని, యుగంధర్ రాజు, హెచ్ఎం గిరి ప్రకాష్ , పద్దు రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత విద్యా ప్రమాణాలు



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, సమరూప దుస్తులను పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - నాగలాపురం: ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత విద్యా ప్రమాణాలు సాధ్యమని నాగలాపురం మండలం టి.పి కోట మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, సమరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటి చైర్మన్ షబానా బేగం, షాజహాన్, సర్పంచ్ సక్కుబాయి సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు జయశంకర్, స్టెల్లా మేరీ, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

రేపు అండర్ 14,16 బాయ్స్ క్రికెట్ సెలక్షన్స్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సిడిసిఏ) ఆధ్వర్యంలో జూన్ 15వ తేదీ ఆదివారం అండర్ 14,16 బాయ్స్ క్రికెట్ సెలక్షన్స్ జరగనున్నట్లు సిడిసిఏ అధ్యక్షులు విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్), కార్యదర్శి రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఎంపిక ప్రక్రియ ఉమ్మడి చిత్తూరు జిల్లాలలోని వాల్మీకిపురం, తిరుపతి, చిత్తూరు.. 3 జోన్లలో నిర్వహించబడుతుందన్నారు. అందులో మదనపల్లి డివిజన్, వాల్మీకిపురంలోని జీ.వి.ఎస్.సి.ఎస్ క్రీడా మైదానం, తిరుపతిలో స్థానిక మంగళం రోడ్డులోని కజారియా టైల్స్ ఎదురుగా ఉన్న సీవీ క్రికెట్ అకాడమీ, చిత్తూరు పోలీస్ గ్రౌండ్లో ఉదయం 9 గంటలకు అండర్ 15 బాయ్స్, అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటలకు అండర్ 16 బాయ్స్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సెలక్షన్స్‌కు హాజరయ్యే క్రీడాకారులు అండర్ 14 బాయ్స్ 1.9.2011 తరువాత జన్మించిన వారై ఉండాలి. అండర్ 16 బాయ్స్ 1.9.2009 తరువాత 31.8.2011 లోపు జన్మించిన వారై ఉండాలన్నారు. రేపు జరిగే ఈ సెలక్షన్స్‌లో పాల్గొనే క్రికెట్ క్రీడాకారులు తెల్లని దుస్తులు, సొంత క్రీడా సామాగ్రితో పాటు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తప్పక తీసుకురావాలని సూచించారు. క్రికెట్‌పై ఆసక్తి ఉన్న క్రీడాకారులు 15.6.2025 (ఆదివారం) జరిగే క్రికెట్ సెలక్షన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా అసోసియేషన్ కోచ్ సునీల్ కుమార్ 9000214966, సిడిసిఏ జాయింట్ సెక్రెటరీ సతీష్ యాదవ్ 8886185559 లను చరవాణి ద్వారా సంప్రదించవలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి నగర పరిధిలో 132 కె.వి సబ్ స్టేషన్ లో విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ కోరకు 14 తేది శనివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపిఎస్పిడిసిఎల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈఈ విన్నకోటి చంద్ర శేఖర్ రావ్ శుక్రవారం తెలిపారు.

ప్రజాశక్తి - పిచ్చాటూరు: శనివారం, విద్యుత్ సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నట్లు, ఈ కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండలంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సుబ్రమణ్యం శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

వేలి ముద్రల ధృవీకరణతోనే అన్నదాత సుఖీభవ సొమ్ము

వ్యవసాయ అధికారి షణ్ముగం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల రైతులకు సంబంధిత సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్లు వద్ద వేలిముద్రలు వేసి ధృవీకరించుకుంటేనే అన్నదాత సుఖీభవ సొమ్మును ప్రభుత్వం జమ చేస్తుందని తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండల వ్యవసాయ అధికారి షణ్ముగం తెలియజేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని 28 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి అర్హులైన రైతులు 5000 మంది పైగా ఉన్నారన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద ఒక్కో కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడాదికి 20 వేల రూపాయలను జమ చేస్తుందని తెలిపారు. అర్హులైన రైతులు వేలిముద్రలు వేసి ధృవీకరించుకోవాలన్నారు. వేలిముద్ర వేసేందుకు ఈనెల 20 తేదీ తుది గడువని తెలిపారు.

బాల కార్మికుల గుర్తింపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలో పలు దుకాణాల్లో పని చేస్తున్న ఎనిమంది బాల కార్మికులను శుక్రవారం అధికారులు గుర్తించారు. ప్రగతి స్వచ్ఛంద సంస్థ, పోలీస్, కార్మిక, విద్యా శాఖ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. బాల కార్మికుల చేత పనిచేయిస్తున్న పలువురు యజమానులపై కేసులు నమోదు చేశారు. ఈ తనికీల్లో ప్రగతి సంస్థ వ్యవస్థాపకులు కెవి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో ఫిజికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పక్షాన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఏపిపిజిసెట్-2025 పరీక్షలు పూర్తయ్యాయి. అయితే ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో పిజి చేరదలచిన వారు ఏపిపిజిసెట్-2025 ఎంట్రన్స్ రాయడంతో పాటు, 100 మార్కులకు ఆటల్లో పాల్గొన్న సర్టిఫికేట్లు సమర్పించవలసి వుంది. ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్‌లో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులకు సర్టిఫికేట్ పరిశీలన కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అప్పారావు ఈ రోజు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపిపిజిసెట్-2025 ద్వారా ఎం.పిఎడ్ లో చేరడానికి 438 మంది దరఖాస్తు చేసుకోగా, 349 మంది పరీక్ష రాశారని, వారి స్పోర్ట్స్, గేమ్స్ సర్టిఫికేట్లు జూన్ 13,14 తేదీలలో యస్వీయూ ఫిజిక్ ఎడ్యుకేషన్ విభాగంలో పరిశీలించి, మార్కులు వేస్తారని తెలిపారు. ఎంతో పకడ్బందీగా, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కన్వీనర్ ఆచార్య పిసి వెంకటేశ్వర్లు ఏర్పాట్లు చేశారన్నారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలనకు ఆచార్య పాల్ (నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు) ఆచార్య శ్రీనివాస్ (శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం) ఆచార్య రామ సుబ్బారెడ్డి (యోగివేమన విశ్వవిద్యాలయం, కడప) ఆచార్య శివశంకర్ రెడ్డి (శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం) నిపుణులుగా వచ్చారని తెలిపారు.

మిశ్రమ పంట విధానంపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి రూరల్ మండలం, అడపా రెడ్డిపల్లిలో డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం అనంతరాజు పేట వారు చీనీ నిమ్మ పరిశోధన తిరుపతి వారి ఆధ్వర్యంలో శుక్రవారం రైతు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తిరుపతి జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖం ఆదేశాల మేరకు పిఎండిఎస్ (మిశ్రమ పంట విధానం) కషాయాలు, జీవామృతం, ఘన జీవామృతం, ఇన్పుట్స్ స్టాళ్లు ఏర్పాటు చేసి వాటిపై అవగాహన కల్పించారు. రసాయన వ్యవసాయం వల్ల కలిగే నష్టాలు, ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలు వాటి మధ్య వ్యత్యాసాలు, ఖర్చు, దిగుబడిల గురించి రైతులకు అవగాహన కల్పించారు. మహిళలకు వెరైటీ తోటలు, ఏటీఎం ఏ గ్రేట్ మోడల్స్ గురించి వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ రైతులకు శాస్త్రవేత్తలు అరటి మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతులు ప్రహ్లాద రెడ్డి, మురగారెడ్డి, మాధవరెడ్డి, యూనిట్ ఇంచార్జ్ అయ్యప్ప నాయుడు, మెంటర్ మిధున్ రెడ్డి, ఐసిఆర్‌పి తరణి, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట ఐసిడిఎస్ వద్ద అంగనవాడి ప్రాజెక్టు మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా అంగన్వాడి ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్వాడీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అయినప్పటికీ ప్రభుత్వం అంగన్వాడీలకు సరైన వసతులు కల్పించడం లేదని అన్నారు. అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రధానమైన సమస్యలు కనీస వేతనం 26000 ఇవ్వాలి, ఫోన్ యాప్‌లు ఒక్క యాప్‌గా చేయాలని, ఎఫ్ఆర్ఎస్ తీసివేయాలని, మే నెల అంతా సెలవులు ప్రకటించాలని, అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధిపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. పరిష్కారాలు చూపకపోతే భవిష్యత్తులో అంగన్వాడీలు పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె అన్నారు. ఈ సందర్భంగా 12 మందితో కూడిన నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి అధ్యక్షులుగా రూపా దేవి, ప్రధాన కార్యదర్శి నెలవాల శ్యామలమ్మ, ట్రెజరర్‌గా మేరీ ప్రమీల, గౌరవ అధ్యక్షులుగా శివకవి ముకుందలను అంగన్వాడీలు అందరూ కలసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రాజెక్ట్ కమిటీ సభ్యులు సంధ్యారాణి, కళావతి, విజయనిర్మల, జానకమ్మ, నవనీత, ప్రవీణ, ఉష, సింధుజ, స్వర్ణలత, సుబ్బలక్ష్మి, శాంతి, సభ్యులు పాల్గొన్నారు.

తల్లికి వందనం కాదు.. వంచనే

నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - వెంకటగిరి: ఎలాంటి నిబంధనలు లేకుండా ఎంత మంది పిల్లలు చదువుతున్నా, వారందరికీ రూ.15000 వంతున తల్లికి వందనం పథకం ద్వారా అందిస్తామన్న కూటమి నేతలు, ఇప్పుడు ఆ మాట తప్పి, తల్లులను మోసం చేశారని వైసిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి విమర్శించారు. వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో ఎన్ జె ఆర్ భవన్‌లో శుక్రవారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. షరతులతో ఎంతమందిని ఆ పథకానికి దూరం చేస్తారో గణాంకాలతో త్వరలో విలేకరుల సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. పాఠశాలల విలీనం, ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవడం వంటి చర్యలు సరికావన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలెప్పుడని ప్రశ్నించారు. హామీల అమలుకు వైసీపీ ప్రజల పక్షాన పోరాడుతుందని హామీ ఇచ్చారు. జర్నలిస్టు కొమ్మినేనిని అరెస్టు చేయడం కక్ష సాధింపు చర్చేనని మండిపడ్డారు. జెమిలి ఎన్నికల్లో కూటమికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

భూ ఆక్రమణలు చేసి.. మాపై ఆరోపణలు తగదు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామపంచాయతీలో ఉన్న ప్రభుత్వ భూములు, కాలువ పోరంబోకు భూములను ఆక్రమించి, నిర్మాణాలు చేసి అమ్ముకున్న వైసిపి నాయకులు మాపై ఆరోపణలు చేయడం సమంజసం కాదని టిడిపి పేరూరు గ్రామపంచాయతీ అధ్యక్షులు కాయం వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సర్పంచి దామినేటి కేశవులు మసీదు స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేసి దాన్ని విక్రయం చేసి లక్షల రూపాయలు వెనకేసుకోవడం వాస్తవం కాదాని ప్రశ్నించారు. పేరూరు గ్రామపంచాయతీ 80 శాతానికి పైగా ప్రభుత్వ, కాలువ పోరంబోకు భూములేనన్నారు. 460 గ్రామ సర్వే నంబర్‌లో ఉన్న కాలువ పోరంబోకులో 10 ఇళ్లు నిర్మించి చెంచు మోహన్ యాదవ్ అమ్ముకున్నారని విమర్శించారు. రెవెన్యూ అధికారులు దీనిని గుర్తించి ఇటీవల కూల్చి వేశారన్నారు. ఇకనైనా వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు.

చిట్టీల పంచాయతీ వికటించి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : చిట్టీల పంచాయతీ వికటించి ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం రాత్రి పట్టణంలోని సంత మైదానంలో చోటు చేసుకుంది. సంత మైదానానికి చెందిన శివ చిట్టీల వ్యవహారంలో పలువురికి నగదు చెల్లించాల్సి ఉంది. అయితే నగదు చెల్లింపుల్లో జాప్యం జరగడంతో పలువురు ప్రముఖుల వద్ద పలుసార్లు పంచాయతీ జరిగింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇద్దరు రాజకీయ నేతల వద్ద పంచాయతీ పెట్టగా మనస్థాపానికి గురైన శివ అక్కడే విషయం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఆయన్ను శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

క్రైం న్యూస్

అనంతపురం జిల్లా వాసి ఆత్మహత్య

ఆత్మహత్య చేసుకున్న ఈశ్వరప్ప.. ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మండల పరిధిలోని, తనియాలి గ్రామ సమీపంలో ఉన్న చెత్త సేకరణ డంపింగ్ యార్డ్ వద్ద శుక్రవారం అనంతపురం జిల్లా వాసి ఈశ్వరప్ప(45) షెడ్ పైకప్పుకు ఉన్న ఇనుప రాడ్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఈశ్వరప్ప గత రెండు రోజులుగా తనియాలి గ్రామ ప్రాంతంలో సంచరిస్తూ పశువుల కాపరుల వద్ద భోజనం చేస్తూ పశువుల కాపరులకు తన పరిస్థితులు తెలియజేస్తూ ఉన్నట్లుగా తెలిపారు. అయితే గురువారం రాత్రి కూడా తనియాలి కమ్మకండ్రిగ సమీపాన ఉన్న బస్టాండ్‌లో అతను నిద్రిస్తున్నట్లు కూడా గ్రామస్తులు గమనించారు. తీవ్ర మనస్థాపం చెంది వారి ఇంటి గొడవల వల్ల ఆత్మహత్య చేసుకుని ఉంటాడని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై అజయ్ కుమార్ సిబ్బందితో వెళ్లి మృత దేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి వద్ద ఉన్న ఆధారాల ద్వారా వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి, కడప జిల్లా, పాలకొండలు రిజర్వు ఫారెస్ట్‌లో రూ. 40 లక్షల రూపాయల విలువ గల 34 ఎర్రచందనం దుంగలతో పాటు, రెండు మోటార్ సైకిల్స్‌ను స్వాధీనం చేసుకొని ఐదు మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆర్ఐ కృపానంద ఆధీనంలోని ఆర్ఎస్ఐ అలీభాష బృందం గురువారం కడప జిల్లా ఫారెస్ట్ రేంజ్ అన్నసముద్రం ప్రాంతంలో కూంబింగ్ చేపట్టినట్లు టాస్క్ ఫోర్స్ వర్గాలు తెలిపాయి. శుక్రవారం ఉదయం మామిళ్ళపల్లి బీట్ పరిధిలో పాలకొండలు అటవీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు కనిపించారని, వారికి సమీపిస్తుండడంతో పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. పడిపోతున్న వారిలో ఐదు మందిని అదుపులోకి తీసుకొని సమీపంలోని 34 ఎర్రచందనం దుంగలు, వారు ఉపయోగించిన రెండు మోటార్ సైకిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వ్యక్తులు కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన వారుగా గుర్తించామన్నారు. ఈ సంఘటనపై తిరుపతి టాస్క్ ఫోర్స్ ఎస్సై రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఈ ఆపరేషన్లో డిఎస్పీలు శ్రీనివాసులు రెడ్డి, ఎండి షరీఫ్ పాల్గొన్నారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

మురళి కృష్ణ మృత దేహం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం, చిన్న సింగమాల తెలుగు గంగ కాలువలో దిగి గల్లంతైన బీటెక్ విద్యార్థి మురళి కృష్ణ(19) మృతదేహం ఎట్టకేలకు లభ్యమైంది. గల్లంతయిన ఘటనా స్థలానికి కొద్ది దూరంలోని కలిపూడి వద్ద శుక్రవారం మురళీకృష్ణ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కళ్లెదుటే స్నేహితుడి మృతి విషయం జీర్ణించుకోలేని ప్రశాంత్ పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేయగా, ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి రూరల్ మండలం, నారాయణ పురం సమీపంలో మదనపల్లి- నాయుడుపేట జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆచూకీ తెలియని మహిళ(50) మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మహిళ రోడ్డుపై నడిచి వెళ్తుండగా వేగంగా వాహనం ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఇది చెరువు కాదు.. రోడ్డే..!

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు మండలం, బండారుపల్లి, మిల్లి వీధిలో శుక్రవారం కురిసిన చిన్నపాటి వర్షానికి సిమెంట్ రోడ్లు వాగులను తలపిస్తున్నాయి. వర్షాలు కురిసిన సమయంలో వీధి మొత్తం నీళ్లతో నిండిపోవడంతో బయట వచ్చేందుకు ఇబ్బందిగా ఉందని, పంచాయతీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు. వర్షపు నీరు నిల్వ ఉండడం వలన సాయంత్రం అయితే దోమలతో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని స్థానికులు కోరారు.

మాటపై నిలబడే నాయకుడు చంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు ఉమేష్ రావు తదితరులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మాటపై నిలబడే నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడని టీడీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు కొనియాడారు. జగన్ పాలనా వైఫల్యాల కారణంగా రాష్ట్రం ఆర్థికంగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నా, ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. శుక్రవారం తల్లికి వందనం సొమ్ములు అమ్మల ఖాతాల్లో జమ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మునిరాజా యాదవ్, కోట చంద్రశేఖర్, బీమాల భాస్కర్, మణి తదితరులు పాల్గొన్నారు.

ఎంపేడు ఎస్టీ కాలనీలో శాంతిని నెలకొల్పుతాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి రూరల్ మండలం, ఎంపేడు ఎస్టీ కాలనీలో శాంతిని నెలకొల్పుతామని శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపేడు ఎస్టీ కాలనీలో ఉన్న గిరిజన కుటుంబాలు రెండు వర్గాలుగా విడిపోయి రాజకీయ కక్షతో కేసులు పెట్టుకున్నాయనీ, ఫలితంగా ఊరు నుంచి వెళ్ళిపోయి అజ్ఞాతంలో ఉంటున్నట్టు తెలిపారు. ప్రస్తుతం వారంతా గ్రామంలోకి వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారనీ, వాళ్ళ రాకకు ఎలాంటి అడ్డంకులు లేకుండా గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ పికెటింగ్, సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా పెట్టినట్లు వివరించారు. దాస్పద వ్యక్తులను బైండోవర్ చేసి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.